షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1 YEAR HAPPY WORK ANNIVERSARY...
సంపుటి : 2 సంచిక : 31 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 13 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు
VOLUME : 02 ISSUE : 31 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Firday 13 Decmbar 2024 PAGES : 8 PRICE : 5/-



## రాజధాని నిర్మాణంలో
# కీలక పరిణామం

- అమరావతి నిర్మాణానికి రుణ సాయం ఒప్పందానికి ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఏ డి బి) ఆమోదముద్ర
- అమరావతి నిర్మాణానికి ఏడిబి నుండి 8000 కోట్ల సాయం
- 17న జరిగే బోర్డు మీటింగ్ లో అమరావతి సాయం ఒప్పందానికి ప్రపంచ బ్యాంకు సైతం ఆమోద ముద్ర

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి కీలక ముందడుగు పడింది. మనీలాలో ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఏ డి బి)తో నిన్న జరిగిన సమావేశం విజయవంతమైంది. రాజధాని నిర్మాణానికి ఏకంగా రూ. 8000 వేల కోట్ల సాయాన్ని అందజేసేందుకు ఈ సంస్థ ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు బ్యాంకుల ఆమోద ముద్ర వేయగానే నిధుల విడుదల ప్రక్రియ ప్రారంభం కానుంది. అమరావతి నిర్మాణానికి రుణ సాయం ఒప్పందానికి ఏసియన్ డెవలప్మెంట్ - మిగతా3లో

## వేగంగా అభివృద్ధి చెందే నగరం
# అమరావతి

- ఏపీకి టాప్ 10 వర్సిటీలు, ఆస్పత్రులు..
- కలెక్టర్ల సమావేశంలో సీఎం
- అమరావతి అనేది ప్రజా రాజధాని.. అలాగే యువతకు ఉపాధి కల్పించే రాజధాని
- విశాఖ, తిరుపతి, అమరావతి నగరాలపై ప్రత్యేక ఫోకస్ ఉంటుంది
- నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచన
- ప్రపంచంలోని టాప్ 10 విశ్వ విద్యాలయాలు, టాప్ 10 ఆసుపత్రులు ఇక్కడకు రానున్నాయి




**అమరావతి**

ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం కొనసాగుతోంది. ఈ సందర్భంగా అమరావతి రాజధాని నిర్మాణంపై సీఎం మాట్లాడుతూ.. అమరావతి అనేది ప్రజా రాజధాని.. అలాగే యువతకు ఉపాధి కల్పించే రాజధాని అని చెప్పుకొచ్చారు. అలాగే విశాఖ, తిరుపతి, అమరావతి నగరాలపై ప్రత్యేక ఫోకస్ ఉంటుందన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక కుటుంబం ఒక ఎంట్రప్రెన్యూర్ అనేది అమలు కావాలన్నారు. పలు నాలెడ్జ్ ఎకానమీ యూనివర్శిటీలు ఇక్కడకు వస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలోని టాప్ 10 విశ్వ విద్యాలయాలు, టాప్ 10 ఆసుపత్రులు ఇక్కడకు రానున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాజధాని అమరావతి వేగంగా అభివృద్ధి చెందే నగరమని సీఎం అన్నారు. విజయవాడ- గుంటూరు లాంటి సిటీలు అమరావతిలో కలిసిపోతాయన్నారు. దానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. అర్బనైజేషన్ పెరుగుతున్న దృష్ట్యా నిరంతరాయంగా అవుటర్ రింగ్ రోడ్ వెలుపల - మిగతా3లో

## వచ్చేదంతా..
# వాట్సాప్ గవర్నెన్స్




- పాలనలో మరింతగా సాంకేతికత వినియోగం
- విభాగాల వారీగా రియల్టైమ్ డ్యాష్బోర్డులు
- ఆర్టీజీఎస్కు మొత్తం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగింత
- మరో వెయ్యి సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు
- జనవరి 1న జనన-మరణాల నమోదుకు నూతన పోర్టల్

**అమరావతి**

సమర్థవంతమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని, రియల్టైమ్లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని - మిగతా3లో




## జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- ఈ సమావేశాల్లోనే సభ ముందుకు బిల్లు
- బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడమే తరువాయి
- విస్తృత సంప్రదింపుల కోసం జేపీసీ సిఫార్సు చేసే అవకాశం
- ఈ బిల్లుపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల అసెంబ్లీల స్పీకర్లనూ ఆహ్వానించనున్నట్టు సమాచారం.
- 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' బిల్ విషయంలో కీలక నిర్ణయం

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హోంమంత్రి అనిత

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలన్న అనిత

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కారణంగా రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీనిపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అనిత అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్లు, కొండచరియలు ఉండే ప్రాంతాల్లో ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక సందేశాలు పంపాలని సూచించారు. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతాన్ని ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం రాగల 24 గంటల్లో బలహీనపడుతుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది.





## ఛత్తీస్గఢ్లో భారీ ఎన్కౌంటర్

- భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు
- ఛత్తీస్గఢ్ అటవీ ప్రాంతంలో మరోసారి కాల్పుల మోత
- 12 మంది మావోయిస్టులు మృతి
- ఘటనా స్థలంలో భారీగా ఆయుధాల స్వాధీనం

## గత ఐదేళ్లలో విద్యారంగాన్ని
# పట్టించుకోలేదు

- ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్ మెంట్ పెరగాలని,
- ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు: నారా లోకేశ్
- అమరావతిలో జిల్లా కలెక్టర్లతో సమావేశం
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- జీరో డ్రాపవుట్స్, ఎన్ రోల్ మెంట్పై దృష్టి సారించాలని వెల్లడి
- మధ్యాహ్న భోజనం, హాస్టల్ మెస్ నాణ్యతకు చర్యలు



**అమరావతి**

గత ఐదేళ్లలో విద్యారంగాన్ని పట్టించుకోలేదని, రాబోయే ఐదేళ్లలో మౌలిక సదుపాయాలు, ఫలితాలపై దృష్టిసారించి ఏపీ మోడల్ విద్యావ్యవస్థ రూపకల్పనకు అధికారులంతా నడుంబిగించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో కలెక్టర్ల సమావేశంలో మానవవనరుల శాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ పెరగాలని, జీరో డ్రాపవుట్స్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు. పారదర్శకమైన విధానాలతో మెరుగైన ఫలితాలు - మిగతా3లో



## దేశంలో రోజు రోజుకూ యాక్సిడెంట్ల సంఖ్య పెరుగుతుంది

- కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ
- రోడ్డు ప్రమాదాలపై అంతర్జాతీయ సమావేశాల్లో చర్చలు జరిగే సమయంలో తన ముఖాన్ని దాచుకోవాల్సి వస్తోంది
- భారత్లో మనుషుల ప్రవర్తన మారాల్సిన అవసరం ఉంది
- సమాజం చాలా మారాలి.. రోడ్డు రూల్ను అందరూ గౌరవించాలి
- రోడ్లపై ట్రక్కుల పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతుంది

# వేగంగా అభివృద్ధి చెందే నగరం అమరావతి

-మొదటిపేజీ తరువాయి

మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని మున్సిపల్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా పచ్చదనం అనే కాన్సెప్టును ప్రజల్లో పెంచేలా చూడాలని వెల్లడించారు. స్వచ్ఛతా శుభ్రతా అనే అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆచారాలు సంప్రదాయాల తరహాలోనే పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నది అలవాటుగా మార్చాలని అధికారులకు సూచించారు.

గత ప్రభుత్వం 82 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త వదిలి వెళ్లిందని దాన్ని తొలగించే పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీ అనే విధానంలో వినియోగించాలన్నారు. పంట వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు, ఎలక్ట్రానిక్స్, మెటల్, ప్లాస్టిక్ ఇలా వేర్వేరు వ్యర్థాలను నిర్వహించే విధానం తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రీసైకిలింగ్ విషయంలో ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు కూడా పనిచేస్తోందని మంత్రి లోకేష్ వెల్లడించారు. సర్క్యులార్ ఎకానమీలో వీటిని భాగం చేయాలని సీఎం సూచించారు. దీనిపై స్పష్టమైన యాక్షన్ ప్లాన్ చేయాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

**ధ్వంసం నుంచి పునర్మాణం దిశగా అడుగులు: సీఆర్డీఏ కమిషనర్**

కలెక్టర్ల సదస్సులో సీఆర్డీఏపై సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాజధానికి సంబంధించిన 15 వేల కోట్ల రుణాన్ని ఆసియా అభివృద్ధి బ్యాంకు తమ బోర్డు మీటింగ్‌లో క్లియర్ చేసిందని ఆయన తెలిపారు. డిసెంబరు 19 తేదీన ప్రపంచబ్యాంకు బోర్డు కూడా అమరావతి రుణంపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. జనవరి నాటికి 31 వేల కోట్ల రుణం అమరావతి నిర్మాణానికి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. జూన్‌లో సీఎం చంద్రబాబు పర్యటన తర్వాత రాజధాని నిర్మాణంపై రోడ్ మ్యాప్ ఇచ్చారని.. గడచిన మూడు నెలల్లో ధ్వంసమైన పరిస్థితుల్ని గాడిన పెట్టగలిగామన్నారు. గడచిన ఐదేళ్లలో పనులు ఆగిపోయాయని.. చాలా మెటీరియల్ దొంగిలించారన్నారు. రహదారులను కూడా తవ్వేశారని.. యంత్రాలు కూడా పాడైపోయినట్లు తెలిపారు.

మొత్తంగా అంతా ధ్వంసమైన పరిస్థితి అని.. అక్కడి నుంచి మొదలు పెట్టి పునర్నిర్మాణం దిశగా అడుగులేస్తున్నామన్నారు. రాజధాని పునర్నిర్మాణంపై ఇంజనీర్లు, ఐఐటీ చెన్నై, హైదరాబాద్ నిపుణులతో అధ్యయనం చేయించి ఓ రోడ్




మ్యాప్‌ను సిద్ధం చేశామన్నారు. ఇప్పుడు కొత్త పనులు చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేయగలిగామని తెలిపారు. రూ.20,500 కోట్ల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి పాలనా అనుమతులు కూడా తీసుకున్నామన్నారు. హడ్కో కూడా మరో రూ. 11 వేల కోట్లు కూడా రుణం ఇచ్చేందుకు ఆమోదం తెలిపిందన్నారు. మొత్తంగా 31 వేల కోట్ల రూపాయల మేర రుణం రాజధాని నిర్మాణాలకు అందుబాటులోకి వస్తుందన్నారు. కీలకమైన నిర్మాణాలతో పాటు రైతులకు ఇచ్చే ఎల్పీఎస్ లే అవుట్‌లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు కూడా ఈ నిధులతోనే పూర్తి చేస్తామని చెప్పారు. రాజధానిలో పనుల్లో మానవ వనరులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు కూడా ప్రపంచబ్యాంకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు.

ఆర్ 5 జోన్ కారణంగా మాస్టర్ ప్లాన్‌లో ఇబ్బందులు వచ్చాయన్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలోని లబ్దిదారులకు ఆయా జిల్లాల్లోనే ఇళ్ల స్థలాలు ఇచ్చేలా ప్రణాళిక చేశామని తెలిపారు. ఆయా లబ్దిదారులకు స్థలాలు ఇచ్చేందుకు ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు ముందుకు రావాలన్నారు. డీపీఆర్‌లు సిద్దం చేస్తే అందుకు అనుగుణంగా నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ స్పష్టం చేశారు.

**పరిశ్రమల కోసం నానా తంటాలు పడుతున్నాం.. మీరూ సీరియస్‌గా తీసుకోండి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం కొనసాగుతోంది. ఇందులో భాగంగా పరిశ్రమల శాఖపై ఆ శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎంతమంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించారన్నది ముఖ్యమని వ్యాఖ్యానించారు. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాల్సి ఉందని వెల్లడించారు. భూసేకరణ సమయంలో స్థానిక రైతులను కూడా భాగస్వాములను చేయాలని సీఎం ఆదేశించారు. ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమ, రామాయపట్నం వద్ద బీపీసీఎల్ రిఫైనరీ ఇలా వేర్వేరు పరిశ్రమలకు భూమి అవసరమని పేర్కొన్నారు.

**రైతులను భాగస్వాములను చేయండి...**

అమరావతి తరహాలోనే రైతులను పరిశ్రమలకు భూములిచ్చే అంశంలో భాగస్వాములను చేయాల్సిందిగా అధికారులకు సూచనలు చేశారు. వివిధ రంగాల్లో ఎంఎస్ఎంఈలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈలను ఎన్యుమరేషన్ చేయించే పని త్వరితగతిన పూర్తి కావాలని సూచించారు. ఒక పరిశ్రమ తయారు చేసిన ఉత్పత్తి మరో పరిశ్రమకు ముడి సరుకు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**ఆ విషయంలో చర్యలు తీసుకోండి: లోకేష్**

20 లక్షల ఉద్యోగాల కల్పనపై కేబినెట్ సబ్ కమిటీ కూడా వేశారని మంత్రి లోకేష్ అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలోనూ చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ప్రతీ పెట్టుబడి విషయంలోనూ కలెక్టర్లు జాగ్రత్తగా డీల్ చేయాలన్నారు. ఆర్సెలార్ మిట్టల్‌కు ఎన్ఎండీసీ ముడి ఇనుము ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని.. పైప్ లైన్ ద్వారా ముడి ఇనుము ఖనిజం వచ్చేలా చేయాలని కోరుతున్నారని లోకేష్ తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం ఉక్కుమంత్రికి, ఎన్ఎండీసీకి స్వయంగా నేనే ఫోన్ చేసి ఫాలోఅప్ చేస్తున్నాని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. కలెక్టర్లు కూడా పెట్టుబడుల విషయంలో ఇదే తరహాలో సీరియస్‌గా ఫాలోఅప్ చేయాలని సూచించారు. "నేను మంత్రిని, కలెక్టర్‌ను అంతా నా దగ్గరకే రావాలన్న ఆలోచన వదిలేయాలి" అని సీఎం సూచించారు.

**అందుకే పదేపదే చెబుతున్నా..**

గత ప్రభుత్వ హయాంలో పెట్టిన ఇబ్బందుల కారణంగా ఏపీకి మళ్లీ రాబోమని వెళ్లిపోయారని దాన్ని సరిదిద్దేందుకు నానా తంటాలు పడుతున్నామని సీఎం వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు ఆలస్యమైతే వారికి వయబిలిటీ విషయంలో ఇబ్బందులు వస్తాయని ఆ కారణంగా ఇతర రాష్ట్రాలవైపు వారు చూసే అవకాశం ఉందన్నారు. అందుకే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై పదేపదే చెబుతున్నట్టు వెల్లడించారు. పర్యాటకం కూడా ఉపాధి కల్పనలో కీలకమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# వచ్చేదంతా వాట్సాప్ గవర్నెన్స్

-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. మొదటగా ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగాలని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలని.. అంతిమంగా 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలో సీఎంవోతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

**వాట్సప్ వేదికగా సరికొత్త వ్యవస్థ :**

కుల ధృవీకరణ దగ్గర నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం, ఇతర ధృవపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలని సూచించారు. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయి కూడా ఆర్టీజీఎస్ పరిశీలించాలని అన్నారు.

**విజువల్స్ ఇంటిగ్రేషన్ :**

డ్రోన్లు, సీసీ కెమేరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైజ్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధృవీకరించుకోవడం జరిగిందని.. అలాగే రానున్న రోజుల్లో పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

**ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి :**

రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగ్గ ధర, 48 గంటల్లో డబ్బులు జమ చేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు తమ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సంతృప్తి స్థాయి తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగ్గా సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే..ఎందుకు వ్యక్తమవుతోందనే దానిని పరిశీలించి తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచార ప్రామాణికతను విశ్లేషించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**95 శాతం దాటిన హౌస్‌హోల్డ్ ట్యాగింగ్**

: రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా, లేదా అనేది సరిచూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**రూ.20 కోట్లతో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలు :**

ఆధార్ సంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించిన రూ.20 కోట్ల నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి అనుమతిచ్చారు. వీలైనంగా త్వరగా గ్రామ ? వార్డు సచివాలయాల్లో వెయ్యి ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

**ప్రత్యేక పోర్టల్ నందు భారీ ప్రాజెక్టుల ప్రగతి :**

రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒకే పోర్టల్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్‌టైమ్‌లో అప్డేట్ చేయాలని చెప్పారు.

**జనన-మరణ ధృవ పత్రాలకు కొత్త పోర్టల్ :**

రాష్ట్రంలో జనన ? మరణ ధృవపత్రాలు పొందేందుకు తలెత్తుతున్న ఇబ్బందులను శాశ్వత పరిష్కారంగా తీసుకువస్తున్న నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. పంచాయతీ రాజ్ ? పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టల్ కొనసాగాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# తమ్ముళ్ల గుప్పిట్లోనే మద్యం దుకాణాలు

**గుంటూరు :** ఏపీలో ప్రైవేట్ మద్యం దుకాణాలు వేలంలో కేటాయించి రెండు నెలలు దాటుతున్న ఇంకా పలు ప్రాంతాల్లో దుకాణాలు తెరుచుకోలేదు. ప్రతి నియోజక వర్గంలో స్థానిక నాయకులే ప్రైవేట్ మద్యం దుకాణాల్లో వ్యాపారాన్ని చేజిక్కించుకున్నారు. లాటరీలో దుకాణాలు వచ్చినా వ్యాపారాలు మాత్రం చేయనివ్వడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ వివాదాస్పదంగా మారింది. అక్టోబర్ 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలు ప్రారంభమైనా ఇంకా పలు ప్రాంతాల్లో దుకానాలు తెరుచుకోలేదు. రాజకీయ మాటున మద్యం దుకాణాలను స్థానిక నాయకుల గుప్పెట్లోకి వెళ్లిపోయాయి. పేరుకు లాటరీలో మద్యం దుకాణాలు కేటాయింపు జరిగినా వ్యాపారాలు మాత్రం స్థానిక నాయకులే నిర్ణయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులకు కాసులు కురిపిస్తోంది. మద్యం వ్యాపారం లాటరీల కేటాయింపులో పారదర్శకంగా జరిగినట్టు కనిపిస్తున్నా వ్యాపారాలు మాత్రం నియోజక వర్గాల వారీగా ప్రజాప్రతినిధుల అనుచరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా దుకాణాలు తెరుచుకోలేదు. కర్నూలు ప్రాంతానికి చెందిన ఓ మద్యం డిస్టిలరీ కంపెనీ తరపున ఏలూరు జిల్లాలో దుకాణాలకు టెండర్లు వేశారు. లాటరీలో ఆ సంస్థకు నాలుగు దుకాణాలు దక్కాయి. రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చి తమ నియోజక వర్గంలో మద్యం వ్యాపారం చేయడమేమిటని స్థానిక నాయకుడు ఆగ్రహం వ్యక్తం చేయడంతో సీమ వ్యాపారులు వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో మద్యం వ్యాపారంలో భారీ ఆదాయాన్ని ఆశించిన కొందరు వ్యక్తులు ఏలూరు జిల్లాలో లాటరీ దక్కించుకున్న కర్నూలు సంస్థతో కోట్ల రుపాయలు చెల్లించి వ్యాపార ఒప్పందాలు చేసుకున్నారువిజయవాడకు చెందిన అధికార పార్టీ నాయకుడి సిఫార్సుతో వ్యాపారం చేసేందుకు రెడీ అయ్యారు. స్థానికేతరులు ఎవ్వరు తన నియోజక వర్గంలో మద్యం వ్యాపారం చేయడానికి వీల్లేదని స్థానిక నాయకుడు తెగేసి చెప్పడంతో విజయవాడ వ్యాపారులు బిత్తర పోయారు. తమ డబ్బు తమకు ఇవ్వాలని కర్నూలు వ్యాపారుల్ని అడిగినా ఫలితం లేకపోయిందని చెబుతున్నారు. ఒప్పందాలు చేసుకునే సమయంలో ఏలూరులో ఉన్న పరిస్థితిని కర్నూలు వ్యాపారులు దాచి పెట్టడంతో డబ్బులు పెట్టిన వాళ్లు ఇరుక్కుపోయారు. లైసెన్స్‌లు వచ్చి రెండు నెలలు దాటుతున్నా ఈ వివాదం కొలిక్కి రాలేదు. ఓ మీడియా సంస్థ యజమానికి అనంతపురంలో మద్యం దుకాణాలు లాటరీలో దక్కాయి. అయితే తమ జిల్లాలో బయటి వ్యక్తులు వ్యాపారం చేయడానికి వీల్లేదని స్థానిక యువ నాయకుడు ఆదేశించడంతో ముఖ్యమైన వ్యక్తులతో సిఫార్సులు చేయించడంతో, జిల్లాలో అడుగుపెడితే తీవ్ర పర్యావసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అవతలి నుంచి హెచ్చరికలు వచ్చినట్టు సమాచారం. తమ జిల్లాలో మద్యం వ్యాపారంలో తమను నమ్ముకున్న వాళ్లే చేస్తారని తేల్చి చెప్పడంతో మౌనంగా ఉండిపోయినట్టు తెలుస్తోంది. మద్యం దుకాణాలను లాటరీలో దక్కించుకున్న వారు ఎంతటి వారైనా , రాజకీయ నేపథ్యం , అంగబలం, అర్థబలం ఉన్నా నియోజకవర్గాల్లో ఉన్న సామంత రాజుల వంటి నేతలు చెప్పినట్టే వినాల్సిన ఉంటుంది. లైసెన్స్ వచ్చిన వారు ఏ ఇబ్బందులు లేకుండా అయా ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవాలంటే 30శాతం వాటా ఇవ్వాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. కొన్ని చోట్ల 50శాతం వాటా కూడా వసూలు చేస్తున్నారు. మాట వినకపోతే ఎక్సైజ్ అధికారులతో నయానోభయానో ఒప్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతినిధుల అనుచరులు, సమీప బంధువులు, వ్యక్తిగత సిబ్బంది ఈ తరహా దందాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్సులు వచ్చినా తెరుచుకోని దుకాణాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది. స్థానిక నాయకులతో రాజీ కుదిరిన తర్వాత వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతిస్తున్నారు. ఏపీలో 2019-24 మధ్య మద్యం దుకాణాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. మద్యం విక్రయాలతో 2024 మార్చి నాటికి రూ.36వేల కోట్లకు పైచిలుకు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఖర్చులు మినహాయించగా దాదాపు రూ.30వేల కోట్లు ఖజానాకు సమకూరాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి వాటి స్థానంలో ప్రైవేట్ దుకాణాలను ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున పోటీ ఏర్పడింది. ఫలితంగా ప్రతి నియోజక వర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యాపారాన్ని తమ గుప్పెట్లోకి తీసుకున్నారు. మద్యం వ్యాపారం, ఇసుక విషయంలో జోక్యం చేసుకోవద్దని పదేపదే ముఖ్యమంత్రి చెబుతున్నా వాటిని నేతలు చెవికి ఎక్కించుకునే పరిస్థితులు లేవు. బెదిరింపులు, బలవంతంగా వాటాలు లాక్కోవడం వంటివి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఒప్పందాలు కుదిరిన చోట మాత్రమే వ్యాపారాలు సజావుగా సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

## రాజధాని నిర్మాణంలో కీలక పరిణామం

-మొదటిపేజీ తరువాయి

బ్యాంక్ (ఏ డి బి) ఆమోదముద్ర వేసింది. అమరావతి నిర్మాణానికి ఏడిబి నుండి 8000 కోట్ల సాయం చేయనుంది. మరోవైపు ఈనెల 17న వరల్డ్ బ్యాంక్ బోర్డు మీటింగ్ నిర్వహించనున్నారు. 17న జరిగే బోర్డు మీటింగ్ లో అమరావతి సాయం ఒప్పందానికి ప్రపంచ బ్యాంకు సైతం ఆమోద ముద్ర వేయనుంది. ఇప్పటికే నిర్మాణానికి రుణ సాయంపై ఒప్పందం రూపకల్పన చేశారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో సుదీర్ఘ కసరత్తు అనంతరం ఈ ఒప్పందానికి తుది రూపుదిద్దారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ప్రపంచబ్యాంకు, ఆసియా అభిద్రుద్ధి బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రపంచ బ్యాంకు బోర్డు ఓకే అన్న అనంతరం ఒప్పంద పత్రంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ప్రపంచబ్యాంకు, ఆసియా అభిద్రుద్ధి బ్యాంకు ప్రతినిధులు సంతకాలు చేయనున్నారు. అనంతరం నిధులు విడుదల ప్రక్రియ ప్రారంభం కానుంది. రుణ రూపేణ అందనున్న మొత్తం 16 వేల కోట్ల నిధులు కానుండగా అందులో ఏడిబి ద్వారా రూ. 8వేల కోట్ల సాయం అందనుంది. మొత్తం రూ. 16 వేల కోట్లలో చెరో 8 వేల కోట్ల రుణాన్ని ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివద్ధి బ్యాంకు అందజేయనుంది. నిధులు అందనున్న నేపథ్యంలో పనులకు సంబంధించి ఇప్పటికే కింది స్థాయిలో పూర్తి ప్రణాళిక సి ఆర్ డి ఏ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. వివిధ పనులకు టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది.

## గత ఐదేళ్లలో విద్యారంగాన్ని పట్టించుకోలేదు

-మొదటిపేజీ తరువాయి



రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపాయాలు, ఎకడమిక్ పెర్ఫార్మెన్స్ ను పొందుపరుస్తూ జిల్లాలవారీగా ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులను అందజేస్తున్నాం. రాబోయే వంద రోజుల యాక్షన్ ప్లాన్ కు అనుగుణంగా అధికారులు దృష్టి సారించాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనంపై దృష్టి సారించాలి. పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం అందజేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం లోకల్ మెనూతో మధ్యాహ్న భోజనం అందించే వెసులుబాటును కలెక్టర్లకు కల్పించాం. ఉన్నత విద్యలో కూడా హాస్టల్, భోజన సౌకర్యాలపై దృష్టిపెట్టాలి. ఇటీవల కాలంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, కనీస మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ప్రతివారం విద్యార్థులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునే విధానాన్ని చేపట్టాం. ఫీడ్ బ్యాక్ ఆధారంగా మెస్, సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో మత్తుపదార్థాల నివారణకు డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్ని స్కూళ్లు, కాలేజీల్లో ఈగల్ టీమ్స్, క్లబ్స్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలి. కేజీ టు పీజీ కరిక్యులమ్ ప్రక్షాళనను చర్యలు చేపడుతున్నాం. అపార్ ఐడీ విషయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. దీనివల్ల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. సాంకేతిక సమస్యలు అధిగమించి పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులంతా కృషిచేయాలి" అని మంత్రి లోకేశ్ కోరారు.

## పర్యాటకానికి ఊతమిచ్చేనా

**విజయవాడ :** ఏపీ నూతన టూరిజం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా కొత్త టూరిజం పాలసీని అమల్లోకి తెస్తున్నట్లు స్పష్టం చేసింది. సరైన ప్రోత్సాహం, నిధుల కేటాయింపుతో టూరిజాన్ని మరింత ముందుకు తీసుకెళ్లొచ్చన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. రాష్ట్రాలకు ఆదాయాన్ని తెచ్చే శాఖల్లో టూరిజం ఒకటి. సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే టూరిజం నుంచి అధిక ఆదాయం పొందవచ్చనేదానికి కేరళ ఒక ఉదాహరణ నిలుస్తోంది. ఆ రాష్ట్ర ఆదాయంలో టూరిజంకు ప్రత్యేక స్థానం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్ లో సైతం టూరిజం అభివృద్ధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఆలయాలు, బీచ్ లు, టూరిస్ట్ ప్రదేశాలకు ఏపీ కేంద్రంగా ఉంది. అయితే సరైన ప్రోత్సాహం లేక పర్యాటక అభివృద్ధికి నోచుకోవడంలేదు. గత ప్రభుత్వాలు సంక్షేమంపై దృష్టి పెట్టి, టూరిజాన్ని నిర్లక్ష్యం చేశాయనేది నిపుణుల అభిప్రాయం. టూరిజాన్ని ఆదాయ మార్గంతో పాటు ఉపాధి కల్పన వనరుగా చూడాలని ప్రభుత్వాలకు సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల, శ్రీశైలం, విశాఖ బీచ్ లు, అరకు లోయ, కోనసీమ అందాలు ఇలా ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. అయితే అవసరమైన నిధులు కేటాయించి ప్రోత్సహిస్తే... కేరళ తరహాలో ఏపీ కూడా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందనే వాస్తవం. ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. రానున్న ఐదేళ్లు (2024-29) ఏపీ టూరిజం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పన అంశాలే లక్ష్యంగా నూతన టూరిజం పాలసీని అమల్లోకి తెస్తున్నట్లు స్పష్టం చేసింది. ఏపీలో పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నూతన పాలసీ ఉంటుందని పేర్కొంది. ఎకో టూరిజం, క్రూయిజ్ టూరిజం, బీచ్ సర్క్యూట్‌లు, బ్యాక్ వాటర్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు నూతన పాలసీ అనువుగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. ఈ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పర్యాటక పాలసీ ఉంటుందని తెలిపింది. పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించడం, పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడం, విదేశీ టూరిస్టులను ఆకర్షించేందుకు నూతన పాలసీని రూపొందించింది. విశాఖపట్నం, అరకు వ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతి ప్రాంతాల్లో ఏడు యాంకర్ హబ్ లు ఏర్పాటు చేయబోతున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల తెలిపారు. అమరావతి-నాగార్జున కొండ, విశాఖపట్నం- తొట్లకొండ ప్రాంతాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు, శైవక్షేత్రాలు ఆలయాలను కలిపేలా 10 సర్క్యూట్ లు ఏర్పాటు చేస్తామన్నారు. కోస్టల్ టూరిజం సర్క్యూట్ లో భాగంగా విశాఖ, కాకినాడ, శ్రీకాకుళం, నెల్లూరు, మచిలీపట్నం ప్రాంతాల్లో ఐదు బీచ్ సర్క్యూట్ లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రివర్ టూరిజం సర్క్యూట్, 2 క్రూయిజ్ టూరిజం సర్క్యూట్ లను అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీకాకుళం-విశాఖ, తూర్పుగోదావరి- గుంటూరు, కర్నూలు- నెల్లూరులలో ఎకో టూరిజం సర్క్యూట్ లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో టూరిజం అభివృద్ధి మరిన్ని అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. సుదీర్ఘమైన సముద్ర తీరం, పచ్చని వాతావరణం, ప్రముఖ ఆలయాలు,నదుల్లో బోటింగ్, ఇతర రాష్ట్రాలు దేశాలతో సులభమైన కనెక్టివిటీ.. ఇలా టూరిజానికి అనుకూలమైన ఎన్నో అంశాలు ఏపీలో ఉన్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వ ప్రోత్సాహం, నిధుల కేటాయింపు ఉంటే ఏపీలో టూరిజం మరో అడుగు ముందుకు వేస్తుం?దని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సోషల్ మీడియా పోస్టులు..
## సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం..

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినెట్ సబ్ కమిటీని వేశారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, హెూంమంత్రి అనితతో క్యాబినెట్ సబ్ కమిటీ వేస్తూ సీఎం ఆదేశాలు జారీ చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెరిగిపోయాయని, ఇంట్లో ఉన్న ఆడవారిని సైతం వదలకుండా పోస్టులు పెడుతున్నారని జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం దృష్టికి మంత్రి నాదెండ్ల తీసుకెళ్లారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో సహా ఎవ్వరినీ వదిలిపెట్టడం లేదని నాదెండ్ల చెప్పారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవరించాలని, మనం తీసుకునే చర్యలు దేశానికే ఆదర్శం కావాలని చంద్రబాబుని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "నేరస్థులు రాజకీయ నాయకుల ముసుగులో బెదిరింపులకు దిగుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న పరిస్థితి ఏపీలో ఉంది. బ్రహ్మకుమారీస్ లాంటి సంస్థలపైనా అసభ్యకర పోస్టులు పెడుతున్నారు. సామాజిక మాధ్యమాల నియంత్రణకు క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నా.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 13.12.24
శుక్రవారం



రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి పై దృష్టి సారించాలి 4

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# అన్నదాతకు అండగా వైసిపి




- రైతులకు రూ. 20 వేలు పెట్టుబడి సాయం ఎక్కడ
- రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- జడ్పీటీసీల పై దుష్ప్రచారం తగదు
- నేడు కలెక్టర్‌కు వినతి పత్రం
- మీడియా సమావేశంలో దర్శి ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 12)

వైసిపి అన్నదాతలకు అండగా నిలుస్తుందని, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన రైతుకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు వెంటనే అమలు చేయాలని, రైతన్నలను మోసం చేస్తున్న కూటమ ప్రభుత్వ తీరుపై శుక్రవారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందని దర్శి ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆరు పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను మరిచిందన్నారు. రైతులకు హామీ ఇచ్చిన అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం పథకాలను ప్రభుత్వ అధికారులకు వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికి పట్టించుకోలేదు అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు అన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే వాళ్ళు లేక నానా ఇబ్బందులు పడ్డాను అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ కాలంలో రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. ప్రభుత్వమే రైతుల పంటకు ఇన్సూరెన్స్ చేయించిందన్నారు. రైతు భరోసా కింద ఏడాదికి రూ. 13 వేల 500 సాయం అందించింది అన్నారు.రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతులకు ఇచ్చిన ఘనత జగన్ ప్రభుత్వం అన్నారు. అయితే నేడా పరిస్థితి లేదన్నారు. వరి సాగు చేసిన రైతులు ఎకరాకు రూ. 15 వేలు పైనే నష్టపోతున్నారన్నారు. పంట ఇన్సూరెన్స్ రైతులే కట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. గిట్టుబాటు ధర కరువైందన్నారు. తక్కువ ధరలకే రైతుల పంటలను కొనుగోలు చేస్తున్నారన్నారు. వీటికి నిరసనగా ఈనెల 13వ తేదీన ఒంగోలులోని అంబేద్కర్ భవనం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలు విరివి గా పాల్గొవాలని కోరారు. అలాగే జడ్పిటిసిలపై ఒక పత్రిక గత మూడు రోజులుగా అబద్ధపు వార్తలు ప్రచురిస్తుందన్నారు. ఇప్పటికీ జడ్పీటీసీలు అంతా తమ పార్టీ వైపే ఉన్నారన్నారు. జడ్పీటీసీలను గెలిచిన సందర్భంలో తమ సొంత ఖర్చులతో విహార యాత్రకు తీసుకుపోయిన, దానిని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. పార్టీ మారిన వారిని కండువాలు వేసుకోవాలని హితావు పలికారు. జడ్పీ చైర్మన్ పదవి తమదేనని తెలిపారు. జిమిలి ఎన్నికలను తాము ఆహ్వానిస్తున్నామని, ఎన్నికల అంటూ వస్తే తమదే విజయం అని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రైతుకు అండగా వైసిపి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వైసిపి కార్యకర్తలు అండగా ఉంటుందన్నారు. తప్పుడు కేసులు బనాయిస్తే పోరాటం చేస్తామన్నారు. తమ పార్టీ జడ్పిటిసిలపై వస్తున్నా వార్తలు అవాస్తవమన్నారు. పత్రికలు రాజకీయ పార్టీలుగా మారకూడదు అన్నారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఒంగోలు నియోజక వర్గం వైసిపి ఇన్చార్జ్ చుండూరి రవిబాబు, రైతు నాయకులు మారెడ్డి సుబ్బారెడ్డి, వైసిపి ఒంగోలు నగర అధ్యక్షులు కటారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ కుసుమ ఫ్యాషన్ అండ్ బోటిక్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల దంపతులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 12)

తన కాళ్ళ మీద తాను నిలబడటమే కాకుండా మరికొందరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ శ్రీ కుసుమ ఫ్యాషన్ అండ్ బోటిక్ సెంటర్‌ని ఏర్పాటు చేసిన నిర్వాహకురాలు బోను దుర్గను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, నాగసత్యలత దంపతులు అభినందించారు. కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కుసుమ ఫ్యాషన్ అండ్ బొటిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ (తరువాయి 4లో...)



## ఒంగోలులో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, సినీ హీరోయిన్ కుమారి శ్రీ లీల

శ్రీ లీలను చూసేందుకు ఎగబడ్డ కుర్రకారు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 12)

ఒంగోలు నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను సినీ నటి శ్రీలలా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు,సతీమణి నాగసత్యలత కలిసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం షాపింగ్ మాల్‌లోని వివిధ విభాగాలను తిలకించారు.ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రమణారావు హాస్పటల్ ఆవరణలో కొత్తగా ఏర్పాటుచేసిన సౌత్ ఇండియాషాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన శ్రీలీల హంగామా చేశారు. శ్రీ లీలను చూసేందుకు యువత ఎగబడ్డారు. సందర్భంగా పుష్ప టు చిత్రంలోని పాటకు సరదాగా స్టెప్పులు వేసి ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా మీడియాతో దామచర్ల మాట్లాడుతూ ఒంగోలు నగరంలో కార్పొరేట్ కల్చర్ బాగా ఊపొందుకుందని ఈ సందర్భంగా పలు ప్రముఖమైన వస్త్ర దుకాణాలు షాపింగ్ మాల్స్ వెలుస్తున్నాయన్నారు. తద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి కల్పిస్తున్నారని ఒక్క ఈ షాపింగ్ మాల్ లోనే 250 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇప్పటికీ ఏపీ ,తెలంగాణ రాష్ట్రాల్లో (తరువాయి 4లో...)



# ఒంగోలులో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

37 పూర్తి చేసుకున్న 38వ బ్రాంచిని ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. హీరోయిన్ శ్రీ లీల మాట్లాడుతూ పలు చిత్రాలలో అవకాశాలు వస్తున్నాయని, ఇటీవల విడుదలైన పుష్ప2 లోని పాటకు మంచి రెస్పాన్స్ వచ్చిందని అన్నారు. ఇంకా అనేక ప్రాజెక్టులు ఉన్నాయని, తనకు అవకాశం ఇచ్చిన పుష్ప2 దర్శకుడు సుకుమార్‌కు థాంక్స్ చెప్పారు. సంస్థ డైరెక్టర్లు సురేష్ సీర్నా, అభినయ్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత 48వ డివిజన్ కార్పొరేటర్ వేమూరి భవాని తదితరులు పాల్గొన్నారు.







## శ్రీ కుసుమ ఫ్యాషన్ అండ్ బోటిక్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల దంపతులు



దంపతులు ప్రారంభించారు. ఫ్యాషన్ రంగంలో వస్తున్న అధునాతన పద్ధతులను అందిపుచ్చుకొని అభివృద్ధి పథంలో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డాక్టర్ కమల, రావుల పద్మజ, ఆర్ల వెంకటరత్నం, వరలక్ష్మి, టి అరుణ, బీరం అరుణరెడ్డి, కొక్కిలగడ్డ లక్ష్మి, నిడమనూరి పావని, కే కుసుమకుమారి, అజిమున్, కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్,కామేపల్లి శ్రీనివాసరావు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు.

## మాలమహా గర్జనకి మాలలు తరలిరావాలి

### మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు దాసరి శివాజీ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 12)**

ఈ నెల 15 వ తేదీన ఛలో గుంటూరు లో జరుగు మాల మహా గర్జనకి మాలలు తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు దాసరి శివాజీ పిలుపునిచ్చారు. ఈరోజు అంబేద్కర్ భవనంలో మాల మహా గర్జన కి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు .అనంతరం శివాజీ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో జరుగుతున్న మాల మహాగర్జన మాలలు తరలిరావాలని, ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ మహా గర్జనలో పాల్గొని మాలల సత్తా ఏంటో చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు దామవరపు శ్రీను, జిల్లా కార్యదర్శి కరుణాకర్,రాజు,కోటి, నగర అధ్యక్షుడు రజనీ కాంత్, కార్యదర్శి మన్నం రమేష్, పాలెటి కోటి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి పై దృష్టి సారించాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 12)**

ఢిల్లీలో కేంద్ర నౌకాయాన శాఖ కేంద్ర మంత్రి శరబానంద సోనోవాల్‌ని కలిసి రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి, శిక్షణా కేంద్రం ఏర్పాటు, ఓడల తయారీ యూనిట్ ఏర్పాటు వంటి పలు అంశాల మీద దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కోరారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com